సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 10 । మే । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.40 వేలు పలికాయి.



విద్యలో 'ఆదర్శ'ం

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈనెల 9 నుంచి 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

8లో

గరిష్టం/కనిష్టం
38.7°/22.1°

జిల్లాలో మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఉక్కపోత అధికంగా ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఉచితవిద్య దరఖాస్తు గడువు పొడిగింపు



పుట్టపర్తి అర్బన్: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగించినట్లు డీఈఓ మీనాక్షి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యాహక్కు చట్టం-2009, ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం సెక్షన్ 12(1) అనుసరించి ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారన్నారు. ఇందుకోసం అర్హులు సీఎస్‌ఈ పోర్టల్‌లో ఈ నెల 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అందిన దరఖాస్తులను 16 నుంచి 20వ తేదీ వరకూ ఆయా సచివాలయాల ద్వారా పరిశీలన చేయించి విద్యార్థుల అర్హతపై నిర్ణయం తీసుకుంటారన్నారు. 22న లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారన్నారు. 24 నుంచి 28 వరకూ విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని డీఈఓ వెల్లడించారు.

15 నుంచి విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్లు



విత్తన నాణ్యతను పరిశీలిస్తున్న అవుటాల రమణారెడ్డి, వ్యవసాయశాఖ డీడీ విద్యావతి

కదిరి అర్బన్: ఖరీఫ్‌లో అందజేసే రాయితీ విత్తనం కోసం ఈనెల 15వ తేదీ నుంచి రైతులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వ్యవసాయ శాఖ డీడీ విద్యావతి తెలిపారు. మంగళవారం ఆమె అగ్రి అడ్వయిజరీ బోర్డు జిల్లా చైర్మన్ అవుటాల రమణారెడ్డి, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డితో కలిసి స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన వేరుశనగ విత్తనశుద్ధి ప్లాంట్‌ను తనిఖీ చేశారు. విత్తన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

సబ్ రిజిస్ట్రార్ అలీ సస్పెన్షన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సబ్‌రిజిస్ట్రార్ అలీపై ఎట్టకేలకు సస్పెన్షన్ వేటు పడింది. అనంతపురం రూరల్ కార్యాలయంలో వారం క్రితం ఏసీబీ అధికారులు దాడులు చేశారు. ముందస్తు సమాచారంతో సబ్‌రిజిస్ట్రార్ అలీ అక్కడి నుంచి వెళ్లిపోయినా, తనిఖీలు కొనసాగించారు. ఆలీ బంధువైన ఇస్మాయిల్ నుంచి రూ.2.30 లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాలుగు రోజుల తర్వాత తిరిగి విధుల్లో చేరిన అలీ మళ్లీ 'మామూలు' బాటే పట్టడంతో ఉన్నతాధికారులు కణేకల్లుకు బదిలీ చేశారు. ఈ క్రమంలోనే అలీపై విచారణ చేయించిన కలెక్టర్.. అతడిని తక్షణమే సస్పెండ్ చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ డీఐజీ మాధవికి ఆదేశాలు జారీచేశారు. ఆ మేరకు మంగళవారం డీఐజీ ఉత్తర్వులిచ్చారు. అయితే, వాటిని తీసుకోకుండానే అలీ వెళ్లిపోయినట్లు తెలిసింది.

ప్రతి ఫైలుకూ మామూళ్లే!

జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి చిరునామాగా మారాయి. డాక్యుమెంటు రైటర్లు, సబ్ రిజిస్ట్రార్లు లోపాయికారి ఒప్పందంతో రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరి నుంచి భారీగా డబ్బు గుంజుతున్నారు. తాజాగా కాగ్ నివేదికలోనూ జిల్లాలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో మరికొంతమంది సబ్‌రిజిస్ట్రార్‌లపైనా ఏసీబీ నిఘా ఉంచినట్లు సమాచారం.

పట్టు దొరుకుతోంది!

- బైవోల్టిన్ పట్టుగూళ్లకు ప్రసిద్ధిగాంచిన శ్రీసత్యసాయి
- ఏప్రిల్‌లో 101 శాతంతో రాష్ట్రంలోనే రెండో స్థానం
- నెలలో 253 మెట్రిక్ టన్నుల బైవోల్టిన్ గూళ్ల ఉత్పత్తి





హిందూపురం మార్కెట్‌లో పట్టుగూళ్లు, (ఇన్‌సెట్) షెడ్డులో పట్టు పురుగుల పెంపకం

సాక్షి, పుట్టపర్తి: పట్టు పరిశ్రమకు శ్రీసత్యసాయి జిల్లా ప్రసిద్ధి గాంచింది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుండటంతో రైతులు కూడా పట్టు పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధిక పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఒక్కోసారి లక్ష్యానికి మించి జిల్లా నుంచి ఉత్పత్తి రావడం విశేషం. అయితే గత ఏప్రిల్ నెల లక్ష్య సాధనలో మాత్రం 15 మెట్రిక్ టన్నులకు గానూ 17.50 మెట్రిక్ టన్నులతో (117 శాతం) తిరుపతి జిల్లా మొదటి స్థానంలో ఉండగా, 252 మెట్రిక్ టన్నులకు గానూ 253 మెట్రిక్ టన్నులతో (101 శాతం) శ్రీసత్యసాయి జిల్లా రెండో స్థానంలో నిలిచింది. తర్వాత స్థానాల్లో తూర్పు గోదావరి (100 శాతం), కాకినాడ (100 శాతం) ఉన్నాయి.

అధిక లక్ష్యం 'శ్రీసత్యసాయి'కే..

ఈ ఏడాదిలో రాష్ట్రంలో 15 వేల మెట్రిక్ టన్నుల బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులు లక్ష్యం విధించుకున్నారు. ఇందులో శ్రీసత్యసాయి జిల్లాకు 6,300 మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఒక్క ఏప్రిల్ నెలలోనే 586.64 మెట్రిక్ టన్నుల బైవోల్టిన్ పట్టు గూళ్ల ఉత్పత్తి టార్గెట్ విధించారు. ఇందులో శ్రీసత్యసాయి జిల్లాకు 252 మెట్రిక్ టన్నుల లక్ష్యం ఇవ్వగా, జిల్లాలో 253.61 మెట్రిక్ టన్ను పట్టుగూళ్లు ఉత్పత్తి అయ్యాయి. అదేవిధంగా ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల ఎకరాల్లో మల్బరీ మొక్కలు నాటాలని లక్ష్యం విధించుకోగా, శ్రీసత్యసాయి జిల్లాకు అత్యధికంగా 3,550 ఎకరాలు కేటాయించారు. ఆ తర్వాత చిత్తూరు జిల్లాకు 3 వేల ఎకరాలు, అనంతపురం, అన్నమయ్య జిల్లాలకు వెయ్యి ఎకరాల చొప్పున లక్ష్యం విధించారు.

బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తి లక్ష్యం (మెట్రిక్ టన్నుల్లో)

జిల్లా	ఏడాది లక్ష్యం	ఏప్రిల్‌కు	సాధించినది	పర్సెంటేజీల్లో
తిరుపతి	375	15	17.50	117
శ్రీసత్యసాయి	6,300	252	253.61	101
తూర్పుగోదావరి	56.25	2.25	2.25	100
కాకినాడ	525	21	21	100
విజయనగరం	52.50	2.1	2.05	98
చిత్తూరు	4,995	199.80	192.65	96
వైఎస్సార్	112.50	4.50	4.22	94
కృష్ణా	37.50	1.50	1.37	91
అనంతపురం	712.50	28.50	25.94	91

రోజుకు సగటున 8 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

తోట పెంపకం, షెడ్డు నిర్మాణం, వ్యాధి నిరోధక మందులు, పట్టు పురుగులు కొనుగోలు విషయంలో రైతులకు ప్రభుత్వం నుంచి రాయితీలు వర్తిస్తున్నాయి. ఆరుతడి పంట కావడంతో తక్కువ నీటితో సాగు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. జిల్లాలోనే మార్కెటింగ్ సౌకర్యం ఉంది. ఫలితంగా రవాణా ఖర్చులు మిగులుతున్నాయి. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో బైవోల్టిన్ పట్టుగూళ్లకు డిమాండ్ ఉంటోంది. వాటి నుంచి తీసిన దారంలో నాణ్యత ఎక్కువగా ఉంటోంది. ఫలితంగా ధరలు ఆశించిన మేర పలుకుతాయి. దీంతో ప్రభుత్వం కూడా బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. ఫలితంగా జిల్లాలో రోజుకు సగటున 8 మెట్రిక్ టన్నుల బైవోల్టిన్ పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతున్నాయి.

ఉష్ణోగ్రత 28 డిగ్రీలు మించరాదు



పట్టు రైతులకు వేసవి నాలుగు నెలలూ గడ్డు కాలం. అయితే ఉష్ణోగ్రతలను అదుపులో ఉంచితే లాభాలు సాధించవచ్చు. రేరింగ్ షెడ్డులో గరిష్టంగా 28 డిగ్రీల ఉష్ణోగ్రతలు మాత్రమే ఉండాలి. ఉష్ణోగ్రతల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎండుగడ్డి, చొప్పగడ్డి, వెదురు తడికెలను షెడ్లపై వేసి తేమ ఆరకుండా నీటితడులు ఇవ్వాలి. కిటికీలకు గోనె సంచులు కట్టి నీటితో తడుపుతూ ఉండాలి.

– పద్మమ్మ, పట్టు పరిశ్రమ జిల్లా అధికారి

నాణ్యత ఆధారంగానే ధరలు



జిల్లాలో 50 వేల ఎకరాల్లో మల్బరీ సాగులో ఉంది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంది. పట్టుగూళ్ల నాణ్యతపై ధరలు ఆధారపడి ఉంటాయి. మంచి వాతావరణం ఉంటే ఆరోగ్యకరమైన పురుగులు నాణ్యమైన పట్టుగూళ్లను ఉత్పత్తి చేస్తాయి. హిందూపురం, ధర్మవరం, కదిరిలో పట్టుగూళ్ల మార్కెట్‌లున్నాయి. హిందూపురం మార్కెట్‌కు నెలకు సగటున 150 మెట్రిక్ టన్నుల బైవోల్టిన్ పట్టుగూళ్లు వస్తున్నాయి.

– లక్ష్మీరెడ్డి, హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్ అధికారి

ఖర్చు తక్కువ.. ఆదాయం ఎక్కువ



నేను ఎకరా పొలంలో ఐదేళ్ల నుంచీ మల్బరీ సాగు చేస్తున్నా. ఇతర పంటలతో పోలిస్తే మల్బరీ సాగులో ఖర్చు తక్కువగా ఉంటుంది. జాగ్రత్తలు తీసుకుంటే అధిక ఆదాయం పొందవచ్చు. నేను ఏటా 8 పంటలు తీస్తున్నాను. ప్రతి పంటకు రూ.40 వేల వరకు ఖర్చు వస్తోంది. ఖర్చులు పోగా ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం వస్తోంది.

– శ్రీనివాస్, హెచ్‌టీ హళ్లి పట్టు రైతు, రొళ్ల మండలం

అప్రమత్తంగా ఉండండి

- డీఐజీ అమ్మిరెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఐజీ అమ్మిరెడ్డి

ఉరవకొండ రూరల్: నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని డీఐజీ అమ్మిరెడ్డి ఆదేశించారు. ఉరవకొండ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ కాఫీ విత్ మెన్ కార్యక్రమం ద్వారా సిబ్బంది ఆలోచనలు అధికారులకు తెలుస్తాయన్నారు. పెట్రోలింగ్ ద్వారా కేసులు తగ్గుముఖం పడతాయని తెలిపారు. కర్ణాటక ఎన్నికల దృష్ట్యా ప్రతి బార్డర్ చెక్‌పోస్టు వద్ద గట్టి భద్రత ఏర్పాటు చేయాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లకు సూచించారు. అనంతరం విడపనకల్లు చెక్‌పోస్టును సీఐ శేఖర్‌తో కలిసి డీఐజీ పరిశీలించారు.

ఐరావత వాహనంపై నృసింహుడు



ఉరవకొండ రూరల్: మండలంలోని ప్రసిద్ధ పెన్నహోబిలం లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం శ్రీవారిని ఐరావత వాహనంపై మాఢవీధుల్లో మేళతాళా నడుమ ఊరేగించారు. ముందుగా స్వామి మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత స్వామి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం నూతన అధ్యాయం

- సేవలు అందకపోయినా.. సమస్యలున్నా 1902కు కాల్ చేయవచ్చు
- కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వ సేవలు నిర్ణీత గడువులోపు అందించడంతో పాటు ప్రజా సమస్యలను సంతృప్తికర స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యంగా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇదో నూతన అధ్యాయమన్నారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి, మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, డీఆర్‌ఓ కొండయ్య, ఏఎస్పీ రామకృష్ణప్రసాద్, తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. సంక్షేమ పథకాలు, సేవలకు సంబంధించి వ్యక్తిగత స్థాయిలో అర్జీదారులకు ఎదురయ్యే సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా 1902 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అధికారులు సానుభూతితో కాకుండా బాధ్యతతో వ్యవహరించి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. ప్రతి అర్జీదారుడితో వ్యక్తిగతంగా మాట్లాడి సమస్య అర్థం చేసుకొని పని చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని సీఎంఓ స్థాయి నుంచి మానిటర్ చేస్తారని, ఈ విషయం గుర్తించి అధికారులు శ్రద్ధతో పని చేయాలన్నారు.

10న జిల్లా స్పెషల్ ఆఫీసర్ రాక..

జిల్లా ప్రత్యేకాధికారిగా నియమితులైన కేవీఎస్ చక్రధర్‌బాబు ఐఏఎస్(ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్) ఈనెల 10వ తేదీ జిల్లాకు వస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో 'స్పందన'పై సమీక్ష ఉంటుందన్నారు. 2022 ఏప్రిల్ 4వ తేదీ నుంచి ఇప్పటి వరకూ స్పందన అర్జీలు ఏయే శాఖకు ఎన్ని వచ్చాయి... ఎన్ని పరిష్కరించారో వివరాలు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ఎన్ని అర్జీలు గడువులోపు పరిష్కరించారు.. ఎన్ని పిటీషన్లు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలో పరిష్కరించారు... ఎన్ని రీఓపెన్ అయ్యాయి... వాటిలో ఎన్ని పరిష్కరించారు..ఇలా ప్రతి అంశానికీ పూర్తి డేటా సిద్ధంగా ఉండాలన్నారు. అలాగే ప్రతి మండలానికీ ప్రత్యేకాధికారిని నియమించామని, సదరు అధికారి ఒక రోజు మండలంలో వచ్చినా పిటీషన్లపై సమీక్షించాలన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ, సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ తరఫున అవసరమైన సహకారం అందిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు మరింత సమర్థవంతంగా పని చేసేందుకు కృషి చేయాలన్నారు.

సేవలు పొందడం ప్రజల హక్కు..

ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను పొందడం ప్రజల హక్కుగా భావించి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్ పారదర్శక పాలనకు ఇది నిదర్శనమన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందికి ఇకపై ఇబ్బందులు ఉంటాయని, దీన్ని గుర్తించి అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు.

కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవానీ శంకరి, సీపీఓ విజయ్‌కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్‌ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, ఏడీ రమేష్, పట్టు పరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, డ్వామా పీడీ రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగప్రసాద్, బీసీ వెల్ఫేర్ డీడీ నిర్మలాజ్యోతి, డీఎల్‌డీఓ శివారెడ్డి, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్యా ఇళ్లు చేరాం

- మణిపూర్ నుంచి స్వగ్రామాలకు చేరుకున్న జిల్లా విద్యార్థులు
- సీఎం జగన్ చొరవతోనే క్షేమంగా తిరిగి వచ్చినట్లు వెల్లడి



స్వగ్రామం చవిటితండాలో తల్లిదండ్రులతో సునీల్ నాయక్

కదిరి అర్బన్/తనకల్లు: తుపాకుల శబ్దం, బాంబుల మోత, ఆర్తనాదాలు, హాహాకారాలు..ఏం చేయాలో, ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి. తాముంటున్న గదుల్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపిన జిల్లా విద్యార్థులు ఎట్టకేలకు మంగళవారం నాటికి స్వగ్రామాలకు చేరుకున్నారు. తమ వారిని చూడగానే గట్టిగా హత్తుకుని కన్నీరుమున్నీరయ్యారు. మణిపూర్‌లో చెలరేగిన అల్లర్ల నేపథ్యంలో అక్కడ చిక్కుకుపోయిన తెలుగు విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం స్వస్థలాలకు తీసుకువచ్చేందుకు వేగవంతంగా చర్యలు తీసుకుంది. సీఎం జగన్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో ఏ ఒక్క విద్యార్థికీ ఇబ్బంది కలగకుండా యంత్రాంగం వారిని గమ్యస్థానాలకు చేర్చింది. ఈ క్రమంలో మణిపాల్‌లో చదువుకుంటున్న కదిరి మండలం చవిటితండాకు చెందిన పీరేనాయక్, దేవీబాయ్ దంపతుల కుమారుడు సునీల్‌నాయక్, తనకల్లు మండలం తిరుమలయ్యగారిపల్లికి చెందిన వినీష్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఇళ్లకు చేరారు. ప్రభుత్వం చేసిన సాయం, సీఎం జగన్ చూపిన చొరవను కొనియాడారు.

ఇంటికి వస్తాననుకోలేదు

నేను మణిపూర్ ఐఐటీలో బీటెక్ ఫస్టియర్ చదువుతున్న. ఇటీవల అక్కడ అల్లర్లు చెలరేగాయి. దీంతో మేమంతా రోజుల తరబడి మా గదులకే పరిమితమయ్యాం. ఆహారం, నీరు దొరక్క తీవ్ర ఇబ్బందులు పడ్డాం. అక్కడి పరిస్థితులు చూశాక నేను క్షేమంగా ఇంటికి చేరుతానన్న నమ్మకం లేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం మాకోసం ఎంతో చేసింది. తెలుగు విద్యార్థులందరినీ గుర్తించి తొలుత మమ్మల్ని మణిపూర్ నుంచి కోలకతాకు తీసుకువచ్చింది. అక్కడి నుంచి విమానంలో హైదరాబాదుకు పంపింది. అక్కడి నుంచి నేను బస్సులో కదిరికి చేరుకున్నా.

– సునీల్ నాయక్, చవిటితండా, కదిరి మండలం

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



నేను ఇంఫాల్ వెస్ట్‌లో బీటెక్ ఇన్ సీఎస్‌ఈ (ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్)ఫస్ట్ ఇయర్ చదువుతున్నా. మణిపూర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. అక్కడ చాలా భయంగా గడిపాం. అక్కడి నుంచి క్షేమంగా ఇంటికి రాగలిగామంటే అది కేవలం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపిన చొరవే. మమ్మల్ని మొదట ప్రత్యేక విమానంలో ఇంఫాల్ నుంచి కోల్‌కతాకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. హైదరాబాద్ నుంచి ఆర్టీసీ బస్సులో ఇంటికి వచ్చాను. ఆపద సమయంలో అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు మా కుటుంబం మొత్తం రుణపడి ఉంటాం.

– వినీష్‌కుమార్‌రెడ్డి , తిరుమలయ్యగారిపల్లి, తనకల్లు మండలం

రాయితీలు సద్వినియోగం చేసుకోండి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మధులత, భవాని శంకరి

- ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్లు భవాని శంకరి, మధులత

తాడిమర్రి: ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ట్రెనీ డిప్యూటీ కలెక్టర్లు భవాని శంకరి, మధులత రైతులకు సూచించారు. మంగళవారం వారు మండలంలోని నార్శింపల్లి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా అప్పస్వామి, లక్ష్మీనారాయణమ్మ తదితరులు సాగు చేసిన చీనీ మొక్కలను పరిశీలించారు. ప్రభుత్వం చీనీ, మామిడి, జామ, సపోటా తదితర పండ్ల తోటలు సాగు చేసే రైతులకు రాయితీలు ఇస్తోందని, వారిని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం వారు నిడిగల్లు గ్రామంలో జరుగుతున్న శ్మశాన వాటిక సరిహద్దు కందకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ, ఉపాధి హామీ ద్వారా వంద రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోజువారీ కూలీ రూ.272 వచ్చేలా పని కల్పించాలని అధికారులకు సూచించారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున ఉదయాన్నే పనులకు వచ్చి పనులు ముగించుకోవాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ, ఏపీఓ సంజీవరెడ్డి, ఈసీ అశోక్‌కుమార్ రెడ్డి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

రంగులేసి బిల్లు చేసుకుంటే చర్యలు

- ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలి
- కలెక్టర్ అరుణ్‌బాబు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: పాత ఇంటి గోడలకు రంగులు వేసి ఇళ్ల బిల్లులు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో పుట్టపర్తి డివిజన్‌లోని ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, డీఆర్‌డీఏ, మెప్మా తదితర శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, హౌసింగ్ ఏఈలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాల్లో రోజువారీ పురోగతి కనిపించాలన్నారు. పుట్టపర్తి డివిజన్‌కు 19,540 ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటికీ 1,330 ఇళ్లకు పునాదులు పడలేదన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి ఈ నెల 20వ తేదీలోపు అవన్నీ బేస్‌మెంట్ స్థాయికి తీసుకురావాలన్నారు. మరో 6,384 ఇళ్లు బిలో బేస్‌మెంట్ స్థాయి, 4,415 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయన్నారు. వాటిపై కూడా దృష్టి సారించి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే ఉన్నతాధికారులకు తెలపాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ఏ దశలోనూ నిర్లక్ష్యం తగదన్నారు. బిల్లుల చెల్లింపు కూడా వేగవంతంగా జరగాలన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో మౌలిక వసతులన్నీ కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణం పూర్తయితే అక్కడ సోక్ పిట్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ భాగ్యరేఖ, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ రషీద్‌ఖాన్, డ్వామా పీడీ రామాంజనేయులు, మెప్మా పీడీ విజయలక్ష్మి, ఏపీఎస్‌పీ డీసీఎల్ ఎస్‌ఈ మోసెస్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం: హౌస్ కీపింగ్, కేర్ టేకర్ తదితర విభాగాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చి గల్ఫ్ దేశాల్లో ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూమ్ మంగళవారం తెలిపారు. కనీసం 5వ తరగతి ఉత్తీర్ణులై.. చదవడం, రాయడం తెలిసిన 18 నుంచి 45 ఏళ్లలోపు మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 16వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపిక చేసిన వారికి హిందూపురం పరిసర ప్రాంతాల్లో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో భాగంగా గల్ఫ్‌లో అనుసరించే మత పరమైన సంస్కృతులు, వారి పద్ధతులు, అలవాట్లు విధానాలతో పాటుగా ఆయా దేశాల చట్టాల గురించి అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గల్ఫ్‌లో ఉపాధి అవకాశాలు చూపుతామన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ అజమాయిషీలో జరిగే కార్యక్రమమని వెల్లడించారు. అందువల్ల నకిలీ ఏజెంట్ల బారినపడి మోసపోవడం ఉండదన్నారు. అలాగే ఉద్యోగికి ఆ దేశ చట్టాల ప్రకారం తగిన జీతభత్యాలు అందుతున్నాయా...లేదా అని ప్రభుత్వమే ఆరా తీస్తుందన్నారు. అలాగే పని చేసే ప్రాంతంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తిన సందర్భంలో భారత రాయబార కార్యాలయం బాధ్యత వహిస్తుందన్నారు. పూర్తి వివరాలకు 9398643930 నంబరులో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

బోధనాసక్తి గల టీచర్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

రాప్తాడు రూరల్: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ తోటగేరిలోని అప్‌గ్రేడ్ బాలికల ఉన్నత పాఠశాల (ప్లస్)లో వివిధ తరగతుల బోధనకు ఆసక్తి ఉన్న ఉపాధ్యాయుల (పీజీటీ) నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అనంతపురం జిల్లా డీఈఓ సాయిరామ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు అర్హులు. ఆసక్తి గల ఉపాధ్యాయులు తగిన విద్యార్హత ప్రతులు జత చేసిన దరఖాస్తును ఈ నెల 10వ తేదీలోపు ఉప విద్యాశాఖ అధికారికి అందజేయాలి.

త్రిశూలం కాదు.. చింత మొక్క



త్రిశూల ఆకృతిలో చింతమొక్క

చిలమత్తూరు: సమస్త విశ్వానికి అధిపతి మహాశివుడు అని పురాణాలు చెబుతున్నాయి. ప్రకృతిలోని అణువు అణువున ఉంటాడన్నది భక్తుల విశ్వాసం. ఇందుకు అద్దం పడుతూ.. మంగళవారం చిలమత్తూరులో త్రిశూలం ఆకృతిలో చింత మొక్క జీవం పోసుకుంది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆ మొక్కను ఆసక్తిగా గమనించడమే కాక... భక్తితో పూజలు చేశారు.

విద్యలో ఆదర్శం

- భవితకు బంగారు సోపానంగా మారిన ఏపీ మోడల్ స్కూళ్లు
- ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- దరఖాస్తు చేసుకున్న పాఠశాలలోనే జూన్ 11న ప్రవేశ పరీక్ష
- ఒక్కొక్క పాఠశాలలో 100 సీట్ల కేటాయింపు



రాప్తాడులోని ఆదర్శ పాఠశాల

రాప్తాడు: ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే ఇంగ్లిష్ బాషపై పట్టు తప్పనిసరి. ఆంగ్లంతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పూర్తి స్థాయి పట్టు ఉన్న వారు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ముందంజలో ఉంటున్నారు. ఈ క్రమంలో కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పోటీ పడలేకపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి... తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నిరుపేద విద్యార్థులకు సైతం కార్పొరేట్ విద్యను చేరువ చేయాలనే సంకల్పంతో ఏపీ ఆదర్శ పాఠశాలలను 2013లో ప్రారంభించారు. మహానేత ఆశయాలకు అనుగుణంగా నేడు ఆదర్శ పాఠశాలలు విప్లవాత్మక ఫలితాలను సాధిస్తున్నాయి. గత విద్యాసంవత్సరానికి గాను ఈ ఏడాదిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,929 మంది విద్యార్థులు హాజరు కాగా, 1,392 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అత్యధికులు 500కు పైగా మార్కులు సాధించడం గమనార్హం.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం..

2022-23 విద్యా సంవత్సరానికిగాను ఏపీ మోడల్ స్కూళ్లలో ఆరో తరగతిలో ప్రవేశాలకు జగన్ సర్కార్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 9 నుంచి ఆన్‌లైన్‌లో మొదలైన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 25తో ముగియనుంది. పూర్తి వివరాలు, దరఖాస్తుల అప్‌లోడ్‌కు https:// apms. apcfss. in/ వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూళ్లలోనే జూన్ 11న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. జూన్ 16న మెరిట్ జాబితా ప్రకటిస్తారు. మెరిట్ లిస్టును బట్టి రోస్టర్ ప్రామాణికంగా సీట్లను కేటాయిస్తూ జూన్ 18న జాబితాను విడుదల చేస్తారు. 19న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుంది. జూన్ 21 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

ఒక్కో పాఠశాలలో 100 సీట్లు..

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 25 ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటు కాగా, ఒక్కో పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు గతంలో 80 సీట్లు మాత్రమే భర్తీ చేసేవారు. విద్యార్థుల తల్లిదండ్రుల డిమాండ్‌కు జగన్ సర్కార్ సానుకూలంగా స్పందిస్తూ ఈ ఏడాది వంద సీట్లకు పెంచింది. ఈ లెక్కన 25 పాఠశాలల్లో 2,500 మంది విద్యార్థులకు 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు దక్కనున్నాయి. ఒక్కో సీటుకు ఐదు నుంచి పది మంది విద్యార్థులు పోటీ పడే అవకాశాలున్నాయి. ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు. ఆదర్శ పాఠశాల లేని మండలాల్లోని విద్యార్థులు సమీప మండలాల ఆదర్శ పాఠశాలకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంది. సొంత మండల విద్యార్థులు లేని పక్షంలో పక్క మండలాల విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు. బాలికలకు పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా హాస్టల్ సౌకర్యం ఉంది.

ఇంటర్ వరకు ఉచితం



పేద విద్యార్థులకు కార్పొరేట్ తరహా విద్యను అందించేందుకు ఆదర్శ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విశాలమైన తరగతి గదులు, మెరుగైన సౌకర్యాలు ఉండడంతో ఈ పాఠశాలలకు ఆదరణ పెరిగింది. ఆదర్శ పాఠశాలలో ఒక్కసారి సీటు దక్కితే ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకూ అన్ని ఉచితమే. ఇంగ్లిష్ మీడియంలో చదువుకోవాలనే తపన ఉండే గ్రామీణ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– పద్మజా దేవి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్, రాప్తాడు

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు బాలాజీనాయక్ (ఫైల్)

పెనుకొండ రూరల్: జాతరలో మొక్కు తీర్చుకునేందుకు వచ్చిన ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన బాలాజీ నాయక్ (32), ప్రియాంకబాయి దంపతులు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. బతుకు తెరువు కోసం కుటుంబసభ్యులతో కలసి ముంబయికి వలస వెళ్లిన బాలాజీ నాయక్.. అక్కడే కారు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం స్వగ్రామంలో జాతర ఉండడంతో మొక్కు తీర్చుకునేందుకు కుటుంబసభ్యులతో కలసి ఆదివారం శెట్టిపల్లికి చేరుకున్నాడు. ఈ క్రమంలో జాతరకు వచ్చే బంధుమిత్రులకు సౌకర్యాలకు కల్పించే పనిలో నిమగ్నమైన బాలాజీ నాయక్... సోమవారం రాత్రి ఇంటి ఎదుట షామియానా వేసే క్రమంలో విద్యుత్ షాక్ గురై కుప్పకూలాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పెనుకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి డ్రైవర్ మృతి



మృతుడు బర్కాతుల్లా

లేపాక్షి: విద్యుత్ తీగలు తగిలి ఓ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని ముక్కడిపేటకు చెందిన బర్కాతుల్లా (45)కు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి లేపాక్షి మండలం కల్లూరులో రైతు నాగిరెడ్డి పొలంలో రేషం షెడ్డు నిర్మాణానికి అవసరమైన ఇసుకను టిప్పర్‌లో తీసుకువచ్చాడు. ఇసుకను అన్‌లోడ్ చేసి ట్రాలీని కిందకు దించకుండా ముందుకు పోనివ్వడంతో విద్యుత్ ఎల్‌టీ లైన్ తీగలు తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ మునీర్ అహమ్మద్ అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

గోరంట్ల: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం గొల్లనకుంట నివాసి లింగన్న (30).. గోరంట్ల మండలం పాలసముద్రం సమీపంలోని ఓ క్యాంటీన్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి పని ముగించుకుని నడుచుకుంటూ వెళుతున్న లింగన్నను పాలసముద్రంలోని గ్రేట్‌వే పాఠశాల వద్ద ద్విచక్ర వాహనంపై వేగంగా దూసుకొచ్చిన పుట్టపర్తి నివాసి ఫైరోజ్ ఢీకొన్నాడు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు వెంటనే హిందూపురంలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న లింగన్నను బెంగళూరుకు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక మంగళవారం ఉదయం ఆయన మృతిచెందాడు. ఘటనపై గోరంట్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రైయినేజీలో పడి చేనేత కార్మికుడి మృతి



నాగార్జున మృతదేహం

ధర్మవరం అర్బన్: మురుగు కాలువలో పడి ఓ చేనేత కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ధర్మవరం మండలం ఏలుకుంట్ల నివాసి నాగార్జున (30)కు భార్య అక్కమ్మ, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. ధర్మవరంలో చేనేత కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఉదయం మద్యం మత్తులో వెళుతూ లక్ష్మీ నగర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న మురుగు కాలువలో తూలిపడ్డాడు. ఆ సమయంలో ఎవరూ గుర్తించకపోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. సాయంత్రం అటుగా వెళ్లిన స్థానికులు మురుగు కాలువలో మృతదేహాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

ముదిగుబ్బ: మండలంలోని అడవిబ్రాహ్మణపల్లి తండాలో అక్రమంగా నిల్వ చేసిన 77 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామ శివారులో దొడ్డిలో బియ్యం నిల్వ చేసిన వారు పరారయ్యారు. వారు ఉపయోగిస్తున్న ఆటోను సీజ్ చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

మహాయజ్ఞాన్ని విజయవంతం చేయండి

కొత్తచెరువు: దేవదాయశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో తలపెట్టిన మహాయజ్ఞం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా దేవాదాయశాఖ అధికారి మల్లికార్జున మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రాభివృద్ధిని కాంక్షిస్తూ లోక కల్యాణార్థం ఈ మహాయాగాన్ని ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకూ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం అండ

- లైంగిక వేధింపులపై కమిటీ ఏర్పాటు
- జోనల్ చైర్‌పర్సన్‌గా మంజులకు అదనపు బాధ్యతలు

అనంతపురం క్రైం: ఆర్టీసీలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా నిలిచింది. మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించేందుకు గతంలో ఉన్న చట్టాన్ని(1999) మరింత బలోపేతం చేస్తూ రీజియన్ (8 జిల్లాలు) స్థాయిలో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్‌పర్సన్‌గా ఆ సంస్థ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పిస్తానంటూ ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

జగనన్న డీఎస్సీ-98 టీయూ ఆవిర్భావం

- జిల్లా అధ్యక్షుడిగా రామాంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు





రెడ్డిపల్లి రామాంజనేయరెడ్డి కె.నాగరాజు

రాప్తాడు రూరల్: జిల్లాలో కొత్తగా టీచర్స్ యూనియన్ ఆవిర్భవించింది. ఎంటీఎస్ కింద పరిగణిస్తూ ఎస్జీటీలుగా నియమితులైన డీఎస్సీ-98 క్వాలిఫైడ్ అభ్యర్థులందరూ ఏకమై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కృతజ్ఞతతో 'జగనన్న డీఎస్సీ-98 (ఎంటీఎస్) టీచర్స్ యూనియన్' పేరుతో కొత్త యూనియన్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఎంటీఎస్ టీచర్లందరూ మూడు రోజుల క్రితం అనంతపురంలో సమావేశమై ఉమ్మడి జిల్లా కమిటీ ఏర్పాటుపై చర్చించారు. ఈ క్రమంలో ఏకగ్రీవంగా ఎంపికైన ఉమ్మడి జిల్లా కమిటీని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా రెడ్డిపల్లి రామాంజనేయరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.నాగరాజు, గౌరవ సలహారులుగా ఎస్.ఈశ్వరరెడ్డి, టి.మల్లికార్జునరెడ్డి, కె.చెన్నకేశవులు, ఉపాధ్యక్షులుగా ఎన్.వేణుగోపాల్, సీహెచ్ రామాంజనేయులు, సి.శ్రీనివాసులు, ఎ.వెంకటేశ్వర్లు, బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా మారుతీప్రసాదరెడ్డి, శంకరనాయుడు, డీసీ ఫక్కీరప్ప, టి.షాన్వాషా, జి.ఆదిశేఖరరెడ్డి, కోశాధికారులుగా ఎం.రామ్మోహన్, రత్నకుమారితో పాటు 15 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు మాట్లాడుతూ.. 98-డీఎస్సీ అభ్యర్థుల 24 ఏళ్ల సమస్యను పరిష్కరించి ఉద్యోగాలు కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మాతాశిశు మరణాలు సిగ్గుచేటు: డీఎంహెచ్ఓ



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి

పుట్టపర్తి అర్బన్: ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్నా, సాంకేతిక పెరిగినా.. ఇంకా మాతాశిశు మరణాలు చోటు చేసుకోవడం సిగ్గు చేటని డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. మాతాశిశు మరణాలపై సంబంధిత అధికారులతో కలసి ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన సమీక్షించారు. గత నెల తాడిమర్రి మండలంలో ఒకరు, బత్తలపల్లి, చిలమత్తూరు మండలాల్లో ఇద్దరేసి చొప్పున మొత్తం ఐదుగురు నవజాత శిశువుల మృతిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు కారణాలను ఆరా తీశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి, డీఐఓ కృష్ణయ్య, వైద్య, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టెలీ వైద్య సేవలపై చైతన్య పరచండి..

టెలీ వైద్య సేవలపై గ్రామీణులను చైతన్య పరచాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి ఆదేశించారు. పుట్టపర్తి మండలం వెంకటగారిపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఫ్యామిలీ ఫిజీషియన్, 104 వైద్య సదుపాయాలపై స్థానికులతో ఆరా తీశారు. పేదలకు నాణ్యమైన వైద్యసేవలను చేరువ చేయడంలో భాగంగా టెలీ హబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆపత్కాలంలో తక్షణ వైద్య సేవల కోసం టెలీ హబ్‌ను సంప్రదించేలా ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత వైద్య, ఆరోగ్య సిబ్బందిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి జోత్స్న, సీహెచ్ఓ నగేష్, సూపర్‌వైజర్లు వెంకటరమణ, చంద్రకళ, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతుడు గంగాధర్

పరిగి: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న రొద్దం గ్రామానికి చెందిన పి.గంగాధర్ (59)కు ఇద్దరు భార్యలు కాగా, మొదటి భార్యకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు, రెండో భార్యకు ఓ కుమారుడు ఉన్నారు. ఈ నెల 5న పరిగి మండలం ఊటుకూరులో ఉంటున్న తన కుమార్తె ఇంటికి వచ్చిన గంగాధర్... మూడ్రోజులుగా కొడిగెనహళ్లిలో బేల్దారి పనుల్లో పాల్గొంటూ స్థానిక ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లోనే నిద్రించేవాడు. సోమవారం రాత్రి మద్యం మత్తులో కొడిగెనహళ్లిలోని చెరువు కట్ట వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. అప్పటికే మద్యం మత్తులో తూలుతున్న గంగాధర్... అదుపు తప్పి చెరువులో పడి నీట మునిగి మృతి చెందాడు. మంగళవారం అటుగా వెళ్లిన స్థానికులు చెరువులో మృతదేహాన్ని గుర్తించి, సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని వెలికి తీయించి, రెండో భార్య కుమారుడు వినయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుట్టపై వ్యక్తి అస్థిపంజరం



వెంకట నాయక్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లి సద్దల గుట్టపై వ్యక్తి అస్థి పంజరాన్ని పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన గొర్రెల కాపరులు.. అస్థి పంజరాన్ని గుర్తించి సమాచారం అందించడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. లభ్యమైన ఆధారాలను బట్టి మృతుడిని శెట్టిపల్లికి చెందిన వెంకటనాయక్ (62)గా ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం మృతుడి భార్య చెన్నమ్మబాయి, కుమారుడు సాయినాథ్ నాయక్‌ను పిలిపించుకుని అస్థి పంజరం వెంకటనాయక్‌దేనని నిర్ధారించుకున్నారు. కాగా, ఈ ఏడాది ఫిబ్రవరి 12 నుంచి వెంకటనాయక్ కనిపించడం లేదు. దీనిపై కుటుంబసభ్యులు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదైంది. మూడు నెలల తర్వాత అస్థిపంజరమై లభ్యం కావడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పక్షవాతంతో బాధపడుతున్న వెంకటనాయక్ గుట్టపైకి ఎలా చేరుకున్నది అర్థం కావడం లేదు. ఘటనపై కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపారు.

రైల్వే శాఖలో బదిలీలు

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లాలోని రైల్వే శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను బదిలీ చేస్తూ ఆ శాఖ డివిజన్ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం రైల్వే స్టేషన్‌లోని కమర్షియల్ విభాగంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ రాంబాబును కదిరికి, తిమ్మప్పను తాడిపత్రికి, ప్రసాద్‌రెడ్డిని ధర్మవరానికి బదిలీ చేశారు. అలాగే కర్ణాటకలోని రాయచూర్‌లో పనిచేస్తున్న షమీనా తాజ్‌ను అనంతపురానికి, ధర్మవరం నుంచి శ్రీనివాసులును అనంతపురానికి బదిలీ చేశారు.